ప్రజాశక్తి
సోమవారం 24 జూన్ 2024 5 అనంతపురం





సిపిఎం జిల్లా నాయకులు ముస్కిన్ మృతదేహానికి సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకుల నివాళి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ముస్కిన్ హఠాన్మరణం

నివాళులు అర్పించిన సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్ ఆదివారం ఉదయం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. వ్యక్తిగత పని నిమిత్తం ఉదయం అనంతపురం మర్కెట్‌యార్డు వద్దకు వచ్చిన సమయంలో ఆయనకు తీవ్రమైన గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన మృతికి సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆదివారం సాయంత్రం సోములదొడ్డి గ్రామం వద్ద జరిగిన అంత్యక్రియల్లో వారు పాల్గొన్నారు.



సిపిఎం జిల్లా నాయకులు ముస్కిన్ (ఫైల్)

మూడు దశాబ్దాలుగా నమ్మిన సిద్ధాంతంకై కృషి

సోములదొడ్డి గ్రామంలో 1992లో జరిగిన వడ్డీ వ్యాపార వ్యతిరేక ఉద్యమంలో సిపిఎంకు ముస్కిన్ పరిచమయ్యారు. అప్పటి నుంచి ఆయన మృతి చెందే వరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసం పార్టీలో పనిచేస్తూ వచ్చారు. అనేక ఒడిదుడుకులు, ప్రలోభాలు ఎదురైనా సిపిఎంకై పనిచేస్తూ నగర నాయకుడిగానూ, జిల్లా కమిటీ సభ్యుడిగా పనిచేశారు. అంతేకాకుండా ఆయన జిల్లా ఆవాజ్ ఉద్యమంలోనూ కీలకంగా పనిచేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగానూ, జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 2019లో జరిగిన ఎన్ఆర్‌సి, సిఎఎ వ్యతిరేక ఉద్యమంలోనూ ముస్కిన్ చురుగ్గా పనిచేశారు.

ముస్కిన్ మృతికి సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకుల సంతాపం

ముస్కిన్ మృతికి సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు సంతాపం తెలిపారు. వారి కటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, సత్యసాయి జిల్లా సిపిఎం కార్యదర్శి ఎం.ఇంతియాజ్, ఆవాజ్ జిల్లా నాయకులు వలి తదితరులు సంతాపం తెలిపారు.అదే విధంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాల రంగయ్య, శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్, రామాంజనేయులు సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీరాములు, లింగమయ్య, మైనార్టీ నాయకులు నదీమ్, మునాఫ్, రజాక్ ,డాక్టర్ వీరభద్ర య్య, ప్రసూన సిపిఎం నగర నాయకులు ప్రకాష్ మసూద్ వలీ, ముర్తుజా, ఇర్ఫాన్ , గౌస్, గోపాల్ ,ఎర్రిస్వామి, వెంకటనారాయణ ,రాజు, వెంకటేష్ ,జీవ, శివప్రసాద్ శీనా, గఫూరు పుష్పరాజు, ఓబులయ్య తదితరులు ముస్కిన్ మృతికి తమ సంతాపం వ్యక్తం చేశారు.

చివరి వరకు సిద్ధాంతానికి కట్టుబడిన మనిషి

తాను నమ్మిన సిద్దాంతం కోసం చివరి వరకు కట్టుబడి పనిచేసిన వ్యక్తి ముస్కిన్ . పార్టీ విధానాలను ముందుకు తీసుకెళ్లడంలో కృషి చేశారు. అదే విధంగా మైనార్టీ సమస్యలపైనా ఆవాజ్‌లో ఉంటూ పనిచేశారు. అనేక ప్రలోభాలు, ఒడుదుడుకులు ఎదురైనా పార్టీ వైపే ఆయన నిలబడ్డారు.

వి,రాంభూపాల్ ,
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

'కార్పొరేట్' దోపిడీ

◆ పెరిగిన ఫీజులు, పుస్తకాల ధరలు
◆ వామ్మో అంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు
◆ కరెంట్ బిల్లుల షాక్, పెరిగిన నిత్యావసరాల ధరలు
◆ పేదలపై రూ.లక్షల్లో భారం



కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లు దోపిడీకి తెరలేపాయి. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఖర్చుల గుబులు నెలకొంది. జూన్ నెల వచ్చిందంటేనే పేద, మధ్యతరగతి కుటుంబాలు భయపడిపోతున్నాయి. స్కూళ్ల ప్రారంభం నేపథ్యంలో ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు ఇతర విద్యా సామగ్రి కొనుగోళ్లతో తల్లిదండ్రులకు చుక్కలు కనపడతాయి. నియంత్రణ అనేది లేకపోవడంతో ఈసారి స్పెషల్ ఎఫెక్ట్ అన్నట్లు ఫీజుల భారం రెట్టింపైంది. దీంతో పాటు నిత్యావసర ధరల పెరుగుదల, ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలతో ప్రజలకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఒక్కో కుటుంబానికి ఈ నెలలో సుమారు లక్ష రూపాయలకు పైనే ఖర్చు వచ్చిపడటంతో, చాలీచాలని వేతనాలతో, పైసాపైసా కూడబెట్టుకునే సామాన్యులు ఈనెలగడిచేదెలా అంటూ ఆందోళన చెందుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

ఇప్పటికే పాఠశాలలు పున: ప్రారంభం కావడంతో ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు దోపిడీ పర్వానికి తెరతీశాయి. పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ ధరలనూ పెంచి తమ గల్లా పెట్టెను నింపుకుంటున్నాయి. పుస్తకాలు, యూనిఫాం విక్రయించకూడదని నిబంధనలు చెప్తున్నా బేఖాతరు చేస్తున్నాయి. ఫీజుల వసూళ్లపై నియంత్రణ లేకపోవడంతో ప్రయివేటు యాజమాన్యాలు అడ్డగోలుగా దోపిడీ సాగిస్తున్నాయి. ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లు వసూలు చేస్తున్న ఫీజులు, ఇతర ఖర్చులు భారీగా ఉండడంతో పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు నలిగిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3,053 ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు దాదాపు 1995, ప్రాథమికోన్నత పాఠశాలలు 469, ఉన్నత పాఠశాలలు 589 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 2,655 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 1916, ప్రాథమికోన్నత 332, ఉన్నత పాఠశాలలు 407 ఉన్నాయి. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలలు దాదాపు 450కు పైగా ఉన్నాయి. వీటితో పాటు ప్రయివేటు, అన్‌ఎయిడెడ్, సిబిఎస్ఇ సిలబస్‌తో నడుస్తున్న ప్రయివేటు, అన్ ఎయిడెడ్ 15 ఉన్నాయి. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో కలిపి దాదాపు 3,90,859 విద్యార్థులు చదువుతున్నారు.

భారీగా డొనేషన్లు

ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు పిల్లల తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. ఆకర్షణీయంగా కరపత్రాలు పంచుతూ టోక్నో...ఈ టెక్నోల పేరుతో క్యాంపెయన్ ముమ్మరం చేశాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలనే ఆలోచనలో పడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారు దగ్గరి పట్టణాల్లోని స్కూళ్లను ఎంచుకునే ప్రయత్నంలో నిమగ్నం కాగా, అక్కడ డొనేషన్లు, ఫీజుల మోత విని భయపడుతున్నారు. యూకేజీ, ఎల్‌కేజీ స్థాయిలోనే వేలాది రూపాయల ఫీజులతో పాటు అధిక మొత్తంలో డోనేషన్లు చెబుతుండటంతో దిక్కుతోచని స్థితి నెలకొంది.

పెన్సిల్ నుంచి పుస్తకాల వరకు మోతే

పాఠశాలలు పున్ణప్రారంభం అవుతున్నాయంటే విద్యార్థుల తల్లిదండ్రులకు గుర్తుచ్చేది ఫీజులు, పుస్తకాలే. ముఖ్యంగా స్కూలులో అడుగు పెట్టాలంటే పుస్తకాలు, నోట్‌బుక్సులతో పాటు, వాటిని భద్రపరుచుకునేందుకు బ్యాగులు, దానికి తోడు లంచ్ బాక్స్, పెన్ను, పెన్సిల్ ఇలా రకరకాల వస్తువులు కొనుగోలు తప్పనిసరి. గతంలో విద్యార్థులు కావాల్సిన పుస్తకాలు తమకిష్ట మొచ్చిన దుకాణంలో కొనుక్కునేవారు. అయితే ఇప్పుడు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల పంథా మారింది. పుస్తకాలు, బెల్టు, టై, యూనిఫాం అన్నీ వారు చదువుతున్న పాఠశాల్లోనే కొనాల్సిన పరిస్థితి. దీంతో పాఠశాలల యాజమాన్యాలు చెప్పిన ధర చెల్లించలేక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ఒకవైపు ఆర్థికభారం, మరోవైపు పిల్లాడి భవిష్యత్ కోసం మౌనంగానే ముందడుగు వేస్తున్నారు. అడ్మిషన్ నుంచి తరగతి గదిలో అడుగు పెట్టేంత వరకు తల్లిదండ్రులకు కంటిమీద కునుకు కరువైపోతోంది.

ప్రయివేటు విద్యాసంస్థలకు విద్యాశాఖ దాసోహం

ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యాశాఖ దాసోహమైంది. ప్రయివేటు పాఠశాలల్లో అధిక ఫీజులు, పుస్తకాల అమ్మకాలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించాం. అయినప్పటికి విద్యాశాఖ అధికారులు పట్టించుకోవటం లేదు. వీరి వైఖరిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలలు తెరవగానే ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు అడ్డగోలుగా ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నాయి. పుస్తకాలు, నోట్ బుక్స్‌ను అధిక ధరలకు అమ్ముతున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలలు, కళాశాలల్లో ఎటువంటి అమ్మకాలు చేపట్టకూడదు. అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

బాబావలి,
ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు

తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు

ప్రయివేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులపై విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఫలానా స్కూల్‌లో ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారని లిఖితపూర్వకంగా రాసిస్తే చర్యలు చేపడతాం. ఫీజుల వివరాలకు సంబంధించి స్కూళ్లలో తప్పనిసరిగా బోర్డులు ప్రదర్శించాలి. పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫారాలు విక్రయించడం నిబంధనలకు విరుద్ధం.

రంగ స్వామి,
ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి



ఫీజులకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు (ఫైల్‌ఫోటో)

జిందాల్ వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం

ఇబ్బందులు పడుతున్న మండలవాసులు

బొమ్మనహాల్ : మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యల నిత్యకృత్యం అవుతోంది. ఇందుకు జిందాల్ పరిశ్రమ వాహనాలే ముఖ్య కారణం. జిందాల్ వాహనాలు రాకపోకలు భారీగా పెరగడంతో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పొలాలకు వెళ్లే రైతులు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సి వస్తోంది. రూ.వేల కోట్లు పెట్టుబడి పెట్టిన పారిశ్రామికవేత్తలు రూ.లక్షలు పెట్టి రోడ్డు వేసుకోకపోతే ఎలా.. అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఒక్కసారి ట్రాఫిక్ జామ్ అయిందంటే గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు. దీంతో మండల కేంద్రం మీదుగా ప్రయాణం అంటే ప్రజలు, వాహనదారులు జడుసుకుంటున్నారు. దీనికితోడు భారీ భారీ వాహనాలు తిరుగుతుండటంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారుతున్నాయి. గతుకుల రోడ్డులో ప్రయాణించాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిందాల్ పరిశ్రమ నిర్వాహకులు పరిశ్రమకు వెళ్లే వాహనాల కోసం ప్రత్యేక రోడ్డు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందు భారీగా నిలిచిపోయిన వాహనాలు (పాతచిత్రం)

ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు

రాష్ట్ర బిసి,ఇడబ్ల్యుఎస్,చేనేత జౌళిశాఖల మంత్రి ఎస్.సవిత

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చేస్తున్నామనిరాష్ట్ర బిసి,ఇడబ్ల్యుఎస్, చేనేత జౌళిశాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా పెనుకొండ నియోజకవర్గానికి వచ్చిన సవితకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆదివారం బెంగళూరు విమానాశ్రయం నుంచి రాష్ట్ర సరిహద్దు బాగేపల్లి టోల్‌గేట్ వద్ద తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. దాదాపు వెయ్యి వాహనాలతో పెనుకొండ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దాదాపు 6 గంటల పాటు ర్యాలీ కొనసాగింది. అనంతరం పట్టణం సమీపంలో వైశాలి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. చేనేతకు పూర్వ వైభవం తీసుకురావడానికి నా వంతు కృషి చేస్తానన్నారు. కేంద్రంలో. రాష్ట్రంలో ఎన్డీఏ భాగస్వామ్య ప్రభుత్వాలు ఉండటం రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేస్తానని తెలిపారు. రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిళ్లలో వెనకబడిన తరగతుల విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ అందించే దస్త్రంపై తొలి సంతకం చేశానని చెప్పారు. వెనకబడిన తరగతుల సంక్షేమం కోసం త్వరలోనే బీసీ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 2014-19 లో ఉమ్మడి 13 జిల్లాలకు మంజూరు చేసిన బీసీ భవన నిర్మాణాలను సైతం పూర్తి చేస్తామన్నారు. జూలై ఒకటో తేదీన ఏడు వేల రూపాయలు సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తామని వివరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సవిత



భారీర్యాలీలో మంత్రి సవిత అభివాదం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి అభినందనలు

శింగనమల : అసెంబ్లీలు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన బండారు శ్రావణిశ్రీకి జిల్లా తెలుగు యువత మాజీ కార్యదర్శి కాయల రాజశేఖర్ యాదవ్ అభినందనలు తెలిపారు. ఆదివారం టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తొలిసారిగా ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగు పెడుతున్న బండారు శ్రావణికి కృతజ్ఞతలు తెలిపారు. సిఎం చంద్రబాబు ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయాలని కోరారు.

నీటి విడుదలకు సన్నద్ధం

హెచ్‌ఎల్‌సి ఎస్ఇ రాజశేఖర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సీజన్ ప్రారంభమవుతున్నందున హెచ్‌ఎల్‌సి పరిధిలో నీటి నిర్వహణకు సన్నద్ధమవుతున్నాం.' అని తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ సూపరింటెండెంట్ ఇంజనీరు రాజశేఖర్ తెలిపారు. ప్రజాశక్తి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో నీటి నిర్వహణ అంశాలపై ఆయన మాట్లాడారు.

ప్రశ్న : తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ఎప్పటి నుంచి నీరు వచ్చే అవకాశముంది ?

జవాబు : జూన్ ప్రారంభంలో మంచి వర్షాలు పడటంతో ఈసారి తొందరగానే డ్యామ్‌కు నీరొస్తుందని ఆశించాం. కాని తుంగభద్ర డ్యామ్ ఎగువ భాగంలో ఆశించినంత వర్షపాతం పడలేదు. దీంతో డ్యామ్‌లో ప్రస్తుతం ఐదు టిఎంసిల వరకే నీరుంది. ఇన్‌ఫ్లో కూడా రెండవ వారంలో నాలుగు వేల క్యూసెక్కులకుపైగా పెరిగింది. తరువాత అది క్రమంగా పడిపోయింది. దీంతో తుంగభద్ర ఎగువ భాగంలో మంచి వర్షాలొస్తే ఇన్‌ఫ్లో పెరిగి డ్యామ్‌కు త్వరగా నీరొస్తే ఎగువ ప్రధాన కాలువకు నీరు తీసుకునే వీలుంది. బహుశా వచ్చే నెల మూడవ వారంలో నీరు తీసుకునే అవకాశముందని అంచనా వేస్తున్నాం.

ప్ర : మొదటి తుంగభద్ర బోర్డు మీటింగులో ఎటువంటి నిర్ణయాలు చేశారు ?

జ : మొదటి మీటింగులో బోర్డు పరిధిలోని అందరూ కూర్చొని ప్రాథమిక అంచనాలను రూపొందించాం.



దీని ప్రకారం ఈ ఏడాది ప్రధాన ఎగువ కాలువకు 26 టిఎంసిలు నీరు కేటాయిస్తూ నిర్ణయించడం జరిగింది. అయితే ఇది అంచనా మాత్రమే. రెండ బోర్డు మీటింగు సమయానికి నీటి కేటాయింపులపై నిర్దిష్టమైన స్పష్టత వచ్చే అవకాశముంటుంది. ఏది ఏమైనా ఈ ఏడాది వాతావరణం కాస్త అనుకూలంగా ఉంటుందన్న అంచనాలు ఉన్నాయి.

ప్ర : గతేడాది జిల్లాకు ఎంత నీర్లు తీసుకోగలిగాం ?

జ : గతేడాది అటు కర్నాటక, ఇటు ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల్లోనూ తీవ్రమైన వర్షాభావ పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో నీరు ఎగువ ప్రధాన కాలువకు 17 టిఎంసిల వరకే తీసుకోగలిగాం. ఉన్నంతలో తాగునీటికి ఇబ్బంది కలుగకుండా తగిన చర్యలు తీసుకోగలిగాం.

ప్ర : ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ లేక అధ్వాన్నంగా ఉంది. ఎక్కడికక్కడ గండ్లు పడుతున్నాయి. వీటి మరమ్మత్తులకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?



హెచ్‌ఎల్‌సి ఎస్ఇ రాజశేఖర్

జ : ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రధాన కాలువకు మూడు చోట్ల గండ్లు పడి ఉన్నాయి. వీటి మరమ్మతులు కోటి రూపాయలతో చేపట్టాం. కొన్ని పనులు ప్రారంభమై ఉన్నాయి. ఇంకా పటిష్టత కోసం కూడా రూ.12 కోట్లతో ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాక వాటిని చేపడతాం. ఎక్కడా ఇబ్బంది కలుకుండా నీటి నిర్వహణపై దృష్టి సారించాం.

కులవివక్ష నిర్మూలనకు రాజీలేని పోరాటం

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-తాడిపత్రి

రాష్ట్రంలో కులవివక్ష నిర్మూలనకు రాజీలేని పోరాటాలు సాగిస్తామని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప స్పష్టం చేశారు. ఆదివారం తాడిపత్రిలో కెవిపిఎస్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు సామాజికంగా, ఆర్థికంగా ముందుకు నడవడంతోపాటు ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన వంటి అంశాలను లక్ష్యంగా చేసుకుని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఏర్పడిందన్నారు. ప్రారంభం నుంచి దళితుల పక్షాన నిబద్ధతతో రాజీలేని పోరాటాలు చేస్తున్నామన్నారు. దళితుల అభివృద్ధికి పాటుపడుతున్నామని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు తగ్గించడం బాధాకరమన్నారు. దళితుల సమస్యల పరిష్కారంపై పాలకవర్గాలు దృష్టి సారించాలంటే అణగారిన సామాజిక తరగతుల్లో ప్రశ్నించే చైతన్యాన్ని పెంచాలన్నారు. దేశవ్యాప్తంగా దళితులపై దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యంగా జరుగుతూనే ఉన్నాయన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు సైతం ఒకొక్కటిగా మాయం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌ప్లాన్ చట్టం ఉన్నా నిధులేమవుతున్నాయో తెలియదన్నారు. బతుకు భద్రత కల్పించే అట్రాసిటీ చట్టం ప్రకారం అరెస్టు అయినా స్టేషన్ బెయిలు ఇస్తున్నారన్నారు. దళిత వృత్తులు నేటికీ అంటరానితనాన్ని భరిస్తూనే ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామగ్రామాన దళితులను సమీకరించి చైతన్యం తీసుకురావడమే ధ్యేయంగా సామాజిక ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.నాగరాజు, అధ్యక్షులు శ్రీరాములు, కార్యదర్శి శివప్రసాద్, పెద్దన్న, తిరుపాలు, తాడిపత్రి మండలంలోని నందలపాడు, ఊరుచింతల, గంగాదేవిపల్లి, సజ్జలదిన్నె, ఆలూరు, పెద్దపొలమడ, చిన్నపొలమడ, వెంకటరెడ్డిపల్లి గ్రామాల నుంచి డప్పు కళాకారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేసుకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురంలోని శారదా మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరం సమిష్టి బాధ్యతతో రాష్ట్రంలోని విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు బాధ్యతతో పోరాడుదామన్నారు. ముఖ్యంగా 117 జీవోను వెంటనే రద్దు చేయాలని, 3, 4, 5 తరగతుల విలీనాన్ని రద్దు చేయాలని, 1998, 2008 ఎంటిఎస్ టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని, సిపిఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన వివిధ రకాల యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత ఐదేళ్లలో విద్యారంగం, ఉపాధ్యాయ వర్గానికి పరిష్కరించలేని సమస్యలన్నింటినీ ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదించి పరిష్కరించాలని కోరారు. వీటితోపాటు సిపిఎస్ విధానం వెంటనే రద్దు చేసేందుకు నూతన ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని, ఉపాధ్యాయులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో మాతృభాషలోనే బోధన జరగాలన్నారు. సెకండరీ స్థాయిలో సమాంతర మీడియంలను కొనసాగించాలని, 12వ పిఆర్‌సిని తక్షణం అమలు చేయాలని, 33శాతం ఇంటీరియం రిలీఫ్ ప్రకటించాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ పిఎఫ్ ప్రమోషన్లు మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యల పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రామప్ప సరళ, కోశాధికారి రాఘవేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శులు హనుమంతురెడ్డి, ప్రమీల, అర్జున్, సంజీవ్‌కుమార్, రవికుమార్, రఘురామయ్య, శేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు మహమ్మద్, జిలాన్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్

గుంతలు పూడ్చరూ..

నార్పలలో గుంతలమయంగా మారిన రోడ్డు

ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని సంత బజారులో సిమెంటు రోడ్డు పూర్తిగా గుంతలమయం అయింది. వర్షాకాలం కావడంతో ఆ గుంతల్లో వర్షం నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. అంతేగాకుండా ప్రతి శనివారం కూరగాయల సంత జరుగుతుంది. దీంతో రోడుకు ఇరువైపులా కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేస్తారు. కూరగాయలు కొనుగోలు చేసేందుకు జనం భారీగా తరలివస్తారు. వీరంతా రోడ్డుపై గుంతలతో సతమతం అవుతున్నారు. వెంటనే స్థానిక పంచాయితీ అధికారులు స్పందించి సంత బజారులో ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.



సంత బజార్ రోడ్డులో పడ్డ గుంతలు



విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు రామకృష్ణ

వ్యవసాయానికి 'ఉపాధి' అనుసంధానంపై హర్షం

ప్రజాశక్తి-నార్పల

ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తూ తొలి సంతకం చేయడం హర్షణీయమని జనసేన పార్టీ మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే గతంలో ఎన్నికల ప్రచారంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన పంటలకు అనుసంధానం చేసే ఫైల్‌పై తొలి సంతకం చేయడం ఆనందదాయకమన్నారు. అధికారంలోకి రాకమునుపే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పవన్‌కళ్యాణ్ తన సొంత నిధులతో కౌలు రైతులను ఆదుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలోకి రావడం, దీనికితోడు ముఖ్యమైన మంత్రి పదవీ స్వీకరించడం పట్ల రైతులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుపాకుల భాస్కర్, పొన్నతోట రామయ్య, షేక్ రహంతుల్లా, వినోదం నారాయణస్వామి, ఉట్టి నరసింహులు, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం

విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని నేతాజీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో ఎన్నికల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వార్తా పత్రికలు, వివిధ సబ్జెక్టుల పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. పాఠ్యాంశాల్లో లేని సబ్జెక్టులను చదవడానికి రోజుకు కనీసం అరగంట సమయం కేటాయించాలన్నారు. చుట్టుపక్కల ఉన్న ప్రతి విషయాన్ని విచారించడం మరో అలవాటు చేసుకోవాలన్నారు. అంతేగాకుండా విషయ పరిజ్ఞానం పెంపొందించుకుంటూ సమాజాన్ని జాగ్రత్తపరిచేలా విద్యార్థులు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎజి రాజమోహన్, కో-కన్వీనర్ ఎంఎస్‌టి.రాజు, రసూల్, పి.చంద్రశేఖర్, మధు, రవి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అతిథులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్బందులు పడ్డ ప్రజలు

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలో ఆదివారం నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నప్పటికీ సబ్‌స్టేషన్‌లో పవర్ బ్రేకర్ లింబ్ పగిలిపోవడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినట్లు విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ బాలచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు చేపట్టాక నాలుగు గంటల అనంతరం తిరిగి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం గుడ్ షెపర్డ్ పాఠశాలకు చెందిన పూర్వపు విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో కలుసుకున్నారు. పాఠశాలలో 1996లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఒకచోట కలిసి సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థుల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శ్యామూల్, వంశీ, రూప ఆధ్వర్యంలో అప్పట్లో పాఠాలు చెప్పి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పటి ఉపాధ్యాయుల విద్యా బోధనతోనే తాము ఇంతటిస్థాయికి ఎదిగామని గుర్తు చేసుకున్నారు.



ఒకచోట చేరిన గుడ్ షెపర్డ్ పూర్వ విద్యార్థులు

వికలాంగుల పింఛను పెంపుపై హర్షం

ప్రజాశక్తి-గుత్తి

వికలాంగులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.3వేలు పింఛన్‌ను సీఎం చంద్రబాబు రూ.6వేలకు పెంచుతూ సంతకం చేయడం పట్ల గుత్తిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో ఉన్న బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఎంఆర్‌పిఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కె.సునీత ఆధ్వర్యంలో పిఎం.నరేంద్రమోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కె. సునీత మాట్లాడుతూ కూటమి నేతృత్వంలో రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వం ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు అమలు చేసే సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు శ్రీనివాసులు, రవి, ఆచారి తదితరులు పాల్గొన్నారు.



మోడీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

జగన్‌ను కలిసిన వైసిపి విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ఎస్‌కెయు వైసిపి విద్యార్థి సంఘం నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం కడప జిల్లా పులివెందులలోని జగన్ నివాసంలో కలిసి పలు విషయాలపై చర్చించారు. ఇందులో భాగంగా ఎస్‌కెయు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో వైసిపి నిర్వహించే ప్రతి కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. జగన్‌ను కలిసిన వారిలో ఎస్‌కెయు వైసిపి విద్యార్థి విభాగం నాయకులు పి. హేమంత్‌కుమార్, ఇతర సభ్యులు ఉన్నారు.



జగన్‌తో వైసిపి విద్యార్థి సంఘం నాయకులు

తండా అభివృద్ధికి కృషి : టిడిపి

ప్రజాశక్తి-బెలుగుప్ప

తండా అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని మండల టిడిపి నాయకులు తెలిపారు. ఆదివారం బెలుగుప్ప తండా గ్రామంలో గ్రామపెద్దల సమక్షంలో ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులను టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సర,ర్భంగా టిడిపి జిల్లా నాయకులు మల్లికార్జున, కంచి రాముడు, వన్నూరు స్వామి మాట్లాడుతూ గ్రామంలో తమ తరుపున అభివృద్ధితోపాటు ఆలయ నిర్మాణం కోసం తమవంతు సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ సభ్యులు భీమానాయక్, పాండురంగనాయక్, మురాజినాయక్, రాయుడు, ఉమ్లానాయక్, గ్రామ పెద్దలు లక్ష్మణనాయక్, వెంకటేష్ నాయక్, గోవిందనాయక్, లాలూనాయక్, ప్రభాకర్ నాయక్, మాజీ ఎంపిటిసి లక్ష్మీబాయి, శివుడు తదితరులు పాల్గొన్నారు.



నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

ఓపెన్ తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం

ఒలింపిక్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఓపెన్ తైక్వాండో పోటీలను తైక్వాండో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.గురుస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లి జాతీయస్థాయిలో పేరు తీసుకురావాలని సూచించారు. పోటీల్లో దాదాపు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో జిల్లా సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి కె.శాంతరాజ్, తైక్వాండో శిక్షకులు కేశవ్, వెంకట్, రాజేష్, మనీంద్ర, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న గురుస్వామి

వైద్యశిబిరం తనిఖీ

పెద్దపప్పూరు : మండల కేంద్రంలో వైద్యసిబ్బంది ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని డిపిఎంఒ జిల్లా అధికారి డాక్టర్ రవిశంకర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వైద్య శిబిరం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. తినే ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు ఉంచుకోవాలన్నారు. భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సి.సురేంద్రరెడ్డి, భారతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, శర్మస్‌వలి, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అధికారి రవిశంకర్

వసతిగృహాలకు నూతన భవనాలు నిర్మించాలి

గుత్తి : జిల్లాలోని శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ వసతి గృహాల్లో నూతన భవనాలను నిర్మించాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ గురుకుల ఎస్టీ, ఎస్సీ, బీసీ వసతి గృహాలు నిర్మించే చాలా ఏళ్లు గడిచిందన్నారు. దీంతో చాలా భవనాలు వర్షం వస్తే కారుతున్నాయన్నారు. పైకప్పులు పెచ్చులు ఊడుతుండటంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. అంతేగాకుండా వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. అలాగే గుత్తిలో మూసివేసిన వసతి గృహాలను పునరుద్ధరించాలన్నారు.

లక్ష మొక్కలు పంపిణీ

నార్పల : మండల కేంద్రంలోని సిద్ధార్థ పిరమిడ్ కేంద్రం ఆవరణలో పిరమిడ్ సీనియర్ మాస్టర్, నార్పల దత్తపుత్రుడు హనుమంతు ఆధ్వర్యంలో ఆదివారం లక్ష మొక్కలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా అనంతపురానికి చెందిన ధ్యానులతోపాటు నార్పల చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ధ్యానుల మధ్య వీర బ్రహ్మంగారి తత్వాలు, ధ్యానసత్సంగం అలరించాయి. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్ర వేషధారి బత్తలపల్లికి చెందిన అహమ్మద్‌బాషా ఆకట్టుకున్నారు. అనంతరం లక్ష మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ పిరమిడ్ ధ్యానులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న అతిథులు

సంపత్‌కుమార్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్ కుమార్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. హిందూపూర్ జోన్ ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, కార్యదర్శి వేణు గోపాల్, కోశాధికారి రియాజ్ ఆదివారం ఆర్థికసాయం అందించారు. తొలుత సంపత్ ఫొటోకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పంపత్ తండ్రికి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి తదితరులు పాల్గొన్నారు.

25లోపు పాఠశాలల్లో చేరండి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని బిఆర్ అంబేద్కర్ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం తరగతుల్లో ప్రవేశం కోసం సీట్లు సాధించిన విద్యార్థులు ఈ నెల 25 లోపు గురుకులంలోని ఆయా తరగతుల్లో చేరాలని గురుకులం ప్రిన్సిపల్ నాగమణి కోరారు. ఈ మేరకు ఆమె ఆదివారం మాట్లాడుతూ సీట్లు సాధించిన విద్యార్థులు చేరకపోతే ఆ తరువాతి మెరిట్ లిస్టులో ఉన్న విద్యార్థులకు ఆ సీట్లు కేటాయించడం జరుగుతుందని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా చేపట్టాలి

ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జయరామ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల బదిలీలను పాదర్శకంగా చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటిక జయరామ్, రాజారామేష్, గౌరవాధ్యక్షులు ప్రకాష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన ఎన్‌డిఎ ప్రభుత్వానికి శుభాకాంక్షలు ధన్యవాదాలు తెలిపారు. సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటు కావడంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్‌లు కీలక పాత్ర పోషించారని తెలిపారు. నూతన ప్రభుత్వం త్వరలోనే ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన బదిలీలు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్న నేపథ్యంలో పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని విజ్ఞప్తి చేవారు. ఉపాధ్యక్షులు కృషికేష్, లక్ష్మీనారాయణ ప్రభుత్వానికి, ప్రభుత్వ శాఖ అధిపతులకు లేఖలు రాయనున్నట్లు తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పాటులో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పాత్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మరువకూడదని గుర్తు చేశారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు బదిలీల్లో అన్యాయం జరగకుండా పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు వృషికేష్, లక్ష్మీనారాయణ, గంగాధర్, పవన్ కుమార్, మనోహర్, డేవిడ్, కవితా, రామంజినమ్మ, సునీత, రజనీకాంత్, ఆంజనేయులు, అనిత, శాంతకుమారి, నాగరాజు, ఆదిశేసు, సీన, రామకృష్ణ, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జయరామ్